కథ

# ఆర్త'నాదం'



పెళ్ళివారిల్లు సందడిగా వుంది. ఎవరికివారు పెళ్ళి బాధ్యతంతా తమ భుజాల మీదే మోస్తున్నట్లు తిరిగే స్తూంటే, పెళ్ళికూతురు లాలిత్య మాత్రం చేతు ల్నిండా గోరింటాకు డిజై న్‌తో, తలనిండా హెన్నాతో ఓ గదిలో కూర్చుని వుంది.

''ఏరా లాలీ! మీ అమ్మేదీ? ప్రొద్దుణ్ణించీ కనిపించలేదు?'' అడిగాడు లాలిత్య తండ్రి క్రిష్ణ స్వామి.

## నందిరాజు పద్మలతా జయరాం

''ఇక్కడే వున్నానండీ! ఏం కావాలి? అన్నట్లు మీరు ప్రొద్దున్నుంచీ కాఫీ చుక్కైనా గొంతులో పోసుకున్నారా? లేదా?'' అంటూ వచ్చింది రుక్మిణి.

''నా సంగతి సరేనోయ్! విషయం విను. రేపు సాయంకాలం ఆరున్నరకల్లా మనం మండపంలో 'ఎదుర్కోలు'కి సిద్ధంగా వుండాలి. సూట్‌కే సులు, డబ్బు, నగలు, పెళ్ళిసామాన్లు అన్నీ సిద్ధంగా వుంచుకోవాలి. ఎవరో ఒకరు వాటికి బాధ్యతగా వుండాలి. ఆనక బాధపడితే ప్రయో జనం లేదు. అది చెప్పడానికే పిలిచాను'' భార్యను హెచ్చరించాడు క్రిష్ణస్వామి.

''సర్లెండి! దానికి నేను ఏర్పాట్లు చేసేశాను గానీ, ఫోటోగ్రాఫర్ సంగతి కనుక్కోండి. బాజా భజంత్రీలు మగపెళ్ళివారి బాధ్యత కదా? కాస్త ఆ విషయం వాళ్ళకి ఫోన్ చేసి గుర్తుచేయండి. ముందు మీకు కాస్త టిఫిన్ తెచ్చిపెడతానుం డండి'' అంటూ లోపలికెళ్ళింది రుక్మిణి.

''ఏరా లాలీ! నీ చీరలు అన్నీ సిద్ధమే కదా!'' కూతురి తల నిమురుతూ అడిగాడు క్రిష్ణస్వామి.

''ఊఁ! అన్నీ రెడీనే. నాన్నా? నన్ను పెళ్ళవం గానే ఇక్కణ్ణించీ పంపేస్తారా!'' బేలగా అడిగిన లాలిత్య కాటుక కళ్ళల్లో నీరూరింది. తండ్రి

దగ్గర ఆమెకి బాగా మాలిమి.

''ఏం తల్లీ! ఇంకా ఇక్కడే వుందామనా! స్టేషన్లో ముందు బండికి సిగ్నలిచ్చినా కదలకపోతే వెనుక బండి కదలడం ఎలాగ? కాస్త నా సంగతీ ఆలోచించు. తప్పదు సోదరీ! ఆడపిల్ల 'ఆడ'పిల్లే! ఈడ పిల్ల కాదు'' తలంబ్రాల్లో చెమికీలు కలుపుతూ అల్లరిగా అంది లాలిత్య చెల్లెలు లావణ్య.

''చూడు నాన్నా! దీనికి మరీ సిగ్గులేకుండా పోయింది. అసలు దానికే ముందు చేస్తే పోయేది పెళ్ళి'' తండ్రితో అంది లాలిత్య.

''హు! ఈరోజు నువ్వు, రెండ్రోజులాగి అదీ! మీ ఇద్దరూ వెళ్ళిపోయాక నాకు, మీ అమ్మకీ పోట్లాడుకుందామన్నా సబ్జెక్టే కరువు. ఆవిడ వంటింట్లో, నేను వసారాలో! అంతే!'' జీరబోయింది క్రిష్ణస్వామి కంఠం.

★ ★ ★

మగపెళ్ళివారి బస్సు వచ్చి రాగానే ఆడపెళ్ళివారు తోడ్కొని వచ్చారు మండపంలోకి. వాళ్ళకి వసతి చూపించి కాఫీ, ఫలహారాలు అందించాక 'ఎదుర్కోలు' వేడుకకి రమ్మంటూ ఆహ్వానించారు రుక్మిణి, క్రిష్ణస్వామి.

పెళ్ళికొడుకు ప్రజ్వల్ కళ్ళు లాలిత్య కోసం వెతకడం గమనించి,

''బావగారూ! అక్క, అదిగో! ఆ గదిలో..అక్కడ కిటికీ దగ్గర కూచుంది'' అతని చెవిలో గుసుగుసగా అంది లావణ్య.

''ఛ! అదేం లేదు! నేనెవ్వరి కోసం వెతకట్లేదు'' బింకంగా అన్నాడు ప్రజ్వల్.

''బావగారూ! మీ భుజాల మీద నాకు పెద్ద పెద్ద గుమ్మడి కాయలు కనిపిస్తున్నాయండోయ్! ప్రస్తుతానికి నాది పోలీసుద్యోగం'' నాలుక బైట పెట్టి వెక్కిరించి అక్కడినుంచీ తుర్రుమంది లావణ్య.

కిటికీవైపు తదేకంగా చూస్తున్న ప్రజ్వల్ కళ్ళు తన కళ్ళతో కలవగానే బుగ్గలు ఎరుపెక్కాయి లాలిత్యకి.

''బావగారూ! అందరూ వచ్చారు కానీ, బాజాభజంత్రీల వాళ్ళు కనిపించరేం? మీ బస్సులో రాలేదా!'' వియ్యంకుడిని ప్రశ్నించారు క్రిష్ణస్వామిగారు.

''అరే! వాళ్ళు మాకన్నా ముందుగానే ఇక్కడికి చేరాలే? మేం పెళ్ళికి తరలి వచ్చేటప్పుడు సన్నాయితోనే కదా బయల్దేరాం! నేనూ మర్చిపోయాను. ఏరీ వాళ్ళు? కనుక్కుందాం వుండండి'' హడావుడి పడిపోయాడు పెద్దాయన.

పెళ్ళివారు బయల్దేరే సమయంలో అక్కడ మంగళవాయిద్యాలు మారు మ్రోగించింది బాషాబృందం. డెబ్బయ్యేళ్ళ వృద్ధా ప్యంలో కూడా బాషా సన్నాయి వాయిస్తే, రాతి గుండెలు సైతం కరిగి నీరవుతాయి. అతను, అతని ఇద్దరు కొడుకులు, కూతురు కలిసి ఓ బృందం. ఎవరింట్లో అయినా నిశ్చి తార్థం జరిగిందని తెలిస్తే చాలు వాళ్ళింట్లో వాలిపోయి ఎలాగైనా పెళ్ళిమేళం తనకే వచ్చేటట్లు చేసుకుంటాడు. తన పంచప్రాణాల్నీ ఊపిరిలో ఇముడ్చుకుని శ్రోతల్ని స్వరసాగరంలో ముంచెత్తుతాడు. అందుకే మతంతో సంబంధం లేకుండా ఆ ఊళ్ళో దాదాపుగా అందరూ సన్నాయి మేళం కావాలంటే అతని పేరే చెబుతారు.

## కొత్త ఇ(ల్లు)న్నింగ్స్

**బాలతార నుంచి హీరోయిన్ స్థాయికి ఎదిగిన అంకిత కెరీర్ ఈమధ్య కాస్త డల్ అయింది. ఆమె నటించిన 'సీతారాముడు' సినిమా విడుదల తర్వాత ఆమెకి ఇంక సినిమాలు లేవు. కొత్తగా ఆమె తరుణ్, ఆకాష్ హీరోలుగా నిర్మాణం అవుతున్న సినిమాలో ఓ హీరోయిన్‌గా అవకాశం దక్కించుకుంది. ఈ సినిమాతో కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్న అంకిత- ఈమధ్యే హైదరాబాదు పంజగుట్ట ప్రాంతంలో ఓ ఫ్లాట్‌ను కొనుక్కుని గృహప్రవేశం చేసింది. తెలుగు సినిమా రంగం ద్వారానే తనకో గుర్తింపు వచ్చిందని అందుకనే హైదరాబాదులో సెటిలవ్వాలని సొంతిల్లు కొనుక్కున్నట్టు చెబుతున్న అంకితకి కొత్త ఇల్లు కలిసిరావాలనే కోరుకుందాం.**



''బావగారూ! ఏం చేద్దాం? ఏదైనా బ్యాండ్‌మేళం కంపెనీవాళ్ళు ఖాళీగా వున్నారేమో కనుక్కోమని పురమాయించేదా! అదయినా రేపు పెళ్ళికి ఏర్పాటు చేయగలమేమో కానీ, ఎదుర్కోలుకి కుదరదు. ఎలాగా?'' వియ్యంకుడిని అడిగాడు క్రిష్ణస్వామి.

''సార్! పక్కన ఏదైనా క్యాసెట్స్ అమ్మే దుకాణం వుందేమో కనుక్కోండి. షేక్ చినమస్తాన్‌గారిదో, ఉస్తాద్ ఆలీఖాన్‌దో మంగళవాయిద్యాల క్యాసెట్ దొరకొచ్చు. వాళ్ళే టేపరికార్డర్ కూడా అద్దెకిస్తారు. ఈ పూటకి పని నడుస్తుంది'' వీడియో తీసే అబ్బాయి క్రిష్ణస్వామికి సలహా ఇచ్చాడు.

వెంటనే ఆ పనిమీద వెళ్ళాడు క్రిష్ణస్వామి.

పెళ్ళికొడుకు ప్రజ్వల్ తండ్రి నారాయణకి చెప్పలేనంత అసహనంగా వుంది. సరిగ్గా సమయానికి ఇలా దగా చేసిన బాషామీద గొంతు

వరకు కోపంగా వుంది. నిన్న తాము బయల్దేరేటప్పుడు బస్సెక్కుతూ వెయ్యి రూపాయల అడ్వాన్స్ కూడా ఇచ్చాడు తను. తర్వాత ఇస్తానంటే వినకుండా వెంటబడేసరికి, తమకన్నా ముందు పెళ్ళి మండపంలో వుండాలని షరతు విధించి మరీ డబ్బు చేతిలో పెట్టాడు. అనవసరంగా ఆడపెళ్ళివారి ముందు అభాసు పాలయినట్లయింది.

''రానీ వెధవని! నాలుక చీరేస్తాను. చేతగానివాడు చేతగానట్లు వూరుకోవాలి. మాట ఇచ్చి తప్పుతాడా! ఈ పెళ్ళిళ్ళ సీజన్‌లో రేపు బ్యాండ్ మేళం కూడా దొరక్కపోతే బాజాభజంత్రీలు లేకుండానే, మంగళవాయిద్యాలు మ్రోగకుండానే చడీ చప్పుడు లేని దొంగ పెళ్ళిలా జరగాల్సిందే కదా నా ఒక్కగానొక్క కొడుకు పెళ్ళి'' చిందులు తొక్కుతున్నాడు.

''అయినా మీదే తప్పు. ఖర్చు మేమిస్తాం. మీరే ఏర్పాటు చేసుకోండి. అని ఆడపెళ్ళివారికే అప్పగిస్తే సరిపోయేది ఆ పని'' దెప్పింది ప్రజ్వల్ తల్లి ఇందిరమ్మ.

''ఆ ముక్క ముందే నువ్వేడవకపోయావా! ఇప్పుడా చెప్పేది'' గయ్యిమన్నాడు నారాయణ భార్యమీద.


''ఊరుకోండి నాన్నగారూ! అరవకండి! ఏదో మార్గం వాళ్ళే చూస్తార్లే!'' తండ్రిని అనునయించాడు ప్రజ్వల్.

కేసెట్లోంచి హృద్యంగా వినిపిస్తున్న ఉస్తాద్ గారి సన్నాయితో ఎదుర్కోలు కార్యక్రమం మొదలయ్యింది. అడుగడుగునా అలకలతో, మరికాస్త కేరింతలతో, ఆ పైన వేడి వేడి చతుర్లతో ఆడపెళ్ళివారి ఆడంగులతో తెగ బ్రతిమాలించుకుని ముందుకు నడిచాడు ప్రజ్వల్. 'నేనేం తక్కువా? అన్నట్లు' ఆడబడుచులతో బ్రతిమాలించుకుని కాబోయే భర్తగారి కళ్ళల్లో కనిపించే వేడికోలుతో కొద్దిగా కరిగి తనూ ముందుకి నడిచింది లాలిత్య.

ఏమైతేనేం? ఓ ప్రహసనం ముగిసింది. వధూవరులు సీతారాముల్లా ఒకరిప్రక్కన ఒకరు

## లక్కీ కాజల్

**ముంబాయి ముద్దుగుమ్మ కాజల్ తొలిచిత్రం 'లక్ష్మీ కల్యాణం'. పదహారణాల తెలుగు పడుచుగా ఎంత చక్కగా ఉందీ అమ్మాయి అనుకున్నారు ఆ సినిమా చూసిన వాళ్లు. ఆ సినిమా ఆశించినంత ఘన విజయం సాధించకపోయినా కూడా కాజల్ గ్లామర్, టాలెంట్ ఆమెకి ఆఫర్లని తెచ్చిపెడుతోందిప్పుడు. తమిళంలో కాజల్ దాదాపు అరడజను సినిమాల్లో నటించబోతోందిప్పుడు. తెలుగులోనూ అవకాశాలు వస్తున్నా కోలీవుడ్ నుంచి మాత్రం ఆమెకి మంచి ఆహ్వానమే లభించిందిట.**



ఒదిగిపోయి కన్నులతో ఆరంభించిన సంభాషణని, కొంచెం పొడిగించి గుసగుసల దాకా వచ్చారు.

★ ★ ★

తెల్లవారింది.

ఉదయం ఏడున్నరకల్లా ముహూర్తం. పెళ్ళికొడుకు తండ్రి నారాయణగారు భయపడ్డట్లే అయింది. బ్యాండ్ మేళం వాళ్ళెవరూ దొరకలేదు. మంగళవాయిద్యాలు లేకుండా పెళ్ళంటే ఉప్పు లేని విందులా చప్పగా అనిపిస్తోంది. ఆయనకి బాషా మీద గొంతు దాకా కోపంగా వుంది. చిటపటలాడుతూనే పెళ్ళిపీటల మీద కొడుకు ప్రక్కన కూర్చున్నాడాయన.

దాదాపు ఏడు ఇరవయ్యవుతూండగా ''ఎవరో పిలుస్తున్నారన్న'' సమాచారంతో వేదిక దిగి బైటికి వచ్చిన నారాయణగారికి ఎదురుగా బాషా కూతురు కనిపించేసరికి కోపం కట్టలు తెగింది.

''ఏమయ్యాడు మీ నాయన? ఉన్నాడా? పోయాడా? అసలు నువ్వెందుకొచ్చావ్! వెళ్ళు! మరో క్షణం ఇక్కడున్నావంటే నేనేం చేస్తానో నాకే తెలీదు'' నిప్పులు కురుస్తున్నాయి ఆయన కళ్ళు.

''మాఫ్ కీజీయే బాబా! ఆ మాట అడగడానికే వచ్చాం. నేనూ, మా తమ్ములూ రాత్రంతా లారీలో ప్రయాణం చేసి వచ్చినాం. మా నాయన ఏడికి పోయినాడో తెల్వదు. మీ మాట పోరాదని నేరుగా ఈడికే వచ్చినాం వెతుక్కుంటూ. ఈ పట్నం మాకు కొత్త. అందుకే జాగయ్యింది'' చేతులు జోడించింది ఆ పిల్ల. పరికిణీ, ఓణీ వేసుకుని మెళ్ళో నల్లదారంతో చక్కగా వుంది. ఆ పిల్లకు దూరంగా ఆమె తమ్ముళ్ళు సన్నాయి, తబలాలు మోస్తూ నిల్చుని వున్నారు.

కోపంగా ఇంకా ఏదో అనబోయే నారాయణ గార్ని మరో పెద్దాయన ఆపి,

''పదమ్మా, తొందరగా! ముహూర్తానికి సరిగ్గా పది నిమిషాలే వుంది. పదండి అన్నయ్యా! పురోహితుడు మిమ్మల్ని పిలుస్తున్నాడు'' అంటూ తీసుకెళ్ళాడు నారాయణ గార్ని వేదిక మీదికి.

సరైన ముహూర్తానికి మంగళవాయిద్యాల మధ్య కన్యాదానం చేశాడు క్రిష్ణస్వామి.

''ధర్మేచ, అర్థేచ, కామేచ, త్వయి ఏషా నాతి చరితవ్యా'' అంటూ ప్రమాణం చేసి లాలిత్యని తన జీవితంలోకి ఆహ్వానించాడు ప్రజ్వల్. సూత్రధారణ సమయం వచ్చేసింది.

ఓ నిమిషం మంగళవాద్యాల ఘోష ఆగింది.

అంతా మేళం వైపు చూశారు. ఎవరో తప్ప తాగిన ముసలివాడు గొడవపెట్టుకుంటున్నాడు.

''వాడే! ఆ బాషా! పెళ్ళి పందిట్లో అల్లరి చెయ్యడానికి వచ్చాడు. ప్రక్కకి తీసికెళ్ళండి'' గట్టిగా అన్నారెవరో! గలాటా జరుగుతుందన్న విషయం రూఢిగా తెలిసిపోవడంతో సందర్భం అంతా సందిగ్ధంగా అయిపోయింది.

ఉన్నట్లుండి ఓ మధుర స్వరం శంకరాభరణంలో ఓ అమృతమయమైన కీర్తన.

''సీతా కల్యాణ వైభోగమే. రామ కల్యాణ వైభోగమే

పవనజ స్తుతి పాత్ర పావన చరిత్ర
రవిసోమ వర నేత్ర రమణీయ గాత్ర''

తాగి తూలుతున్న బాషా నోటిలోని సన్నాయి పరవళ్ళు తొక్కుతోంది.

అంతవరకూ అసహ్యించుకున్న మనుషులే అతన్ని ఆదరంగా ఆశ్చర్యంగా చూడసాగారు.

సూత్రధారణ అయిపోయింది. ఆనందోత్సాహాల మధ్య తలంబ్రాలు మొదలయ్యాయి.

''సీతారాముల కల్యాణము చూతము రారండీ!'' మరో హృద్యమైన గీతం.

''నీ లీల పాడెద దేవా!'' మురిపించే మువ్వల సవ్వడి కూడా సన్నాయిలో కలిసిందా అన్నట్లున్న అనుభూతి అందరిలో.

ఇక ఆగలేదు బాషా?

ఆనంద తాండవమాడాడు. అది అతనిలోని విద్య ప్రభావమో! తాగిన మధువు ఒలికిందే మధు మంజుల స్వరమో గానీ సన్నాయి అతగాడి అధీనంలో అంబరాన్ని తాకుతోంది.

ప్రజ్వల్ అడుగున అడుగేసి నడుస్తోంది లాలిత్య సప్తపదిలో.

''సామజ వరగమనా! సాధు హృత్ సారసాబ్జ సాల'' అంటూ సాగింది సన్నాయి.

పరవశమయిపోతున్నారు అతిథులు. దాదాపుగా అందరూ తమ కుర్చీలని వేదిక వైపునుంచీ వాయిద్యాల వైపునకు తిప్పుకున్నారు. చప్పట్లతో బాషాని ప్రోత్సహిస్తుంటే, అతను ఆనందంతో వెర్రెత్తిపోతున్నాడు. ఊపిరి తీసుకోవడం మరచినట్లు ఒకటి తర్వాత ఒకటి కృతులు వెలువడుతూనే వున్నాయి అతని సన్నాయి నుంచి. అందుకు దీటుగా మృదంగం మోగుతోంది.

''ఎందరో మహానుభావులు
అందరికీ వందనములు''

శ్రీరాగం సమ్మోహపరిచింది.

''శ్రీరామా రఘురామ శృంగార రామ యని చింతించరాదె ఓ మనసా'' యదుకుల కాంభోజి బాషా లలిత స్వర ఝుంకారంలో ఒదిగిపోయింది. కౌసల్య, దశరథుడు, జానకి, నారదుడు, జనకుడు అందరూ ఏ తపాలు చేశారో అని చింతించే త్యాగయ్యగారు అందర్నీ కంటనీరు పెట్టించారు.

అది ఓ క్షణం సేపే!

అతని కళ్ళకి బంగారు బొమ్మలాంటి లాలిత్య నవ్వుతూ కనిపించింది. అంతే!

''చక్కని తల్లికి ఛాంగుభళా
చక్కెర మోవికి ఛాంగుభళా''

మరోసారి సొగసులు పోయింది సన్నాయి.

ఇక ఆగేది లేనట్లు రెండు గంటలు సాగింది కచేరి. వడ్డనలు ఆపేసారు వంటవాళ్ళు. వీడియో ఇటువైపు తిరిగి చాలా సేపయింది. ఆకలి మరిచారు ఆహూతులు. ఇంటి సంగతి మరచిపోయి తల్లీనమైపోయారు ఆడవాళ్ళు. ఆనంద తరంగాల హోరు తగ్గీ తగ్గగానే, కరతాళ ధ్వనులు మిన్నంటాయి. అలసి సొలసిన బాషా వెనక్కి వాలాడు.

అద్భుతం!

అపూర్వం!

వారెవ్వా! ఎంతటి కళాకారుడు!

అందరి నోళ్ళలోనూ ఒకే మాట.

బాషాకి మజ్జిగ ఇచ్చిన తర్వాత మామూలయ్యాడు. అందరికీ దండాలు పెట్టాడు.

''ఏమయ్యా! ఇంత కంగారుపెట్టావు. సమయానికి రాకపోయేసరికి ఎంత ఇబ్బందిపడ్డామో! పోన్లే! మా పరువు కాపాడావు'' అన్నాడు నారాయణ బాషాని కౌగిలించుకుంటూ.

''ఎప్పటికీ మరువలేమయ్యా ఈ పెళ్ళి వేడుకని. విందు భోంచేయకుండానే కడుపునిండింది'' చెప్పాడు మరో పెద్దాయన.

''ఇంతకీ ఏమిటి సంగతి? ఈ వేషమేమిటి? ఈ వైఖరేమిటి?'' అడిగాడు మరొకవ్యక్తి అస్తవ్యస్తంగా వున్న అతని దుస్తుల్నీ, జేబులోనుండి తొంగి చూస్తున్న సారాసీసాని చూస్తూ.

''మాఫ్ కీజియే జనాబ్! తప్పే జేసినాను. కుటుంబం పెద్దది. పదకొండుమంది పిల్లల్ని సాకాల్నంటే ఇదిగో! ఈ సన్నాయే ఆధారం. పెళ్ళిళ్ళ సీజనయితేనే ఇన్ని గంజినీళ్ళు. లేకుంటే పస్తులే! మంచిగా జరిగిన రోజుల్లో దేశమంతా తిరిగినా! కచేరీల్లో, జుగల్‌బందీల్లో ముషాయిరాల్లో ఎన్నింట్లోనో పాల్గొన్నా! బాషా నాదస్వరం వాయిస్తే వినేవాళ్ళు నాగులై తలలూపుతారని అనేవాళ్ళందరూ! కానీ, ఈరోజు అట్ల లేదు సారూ! మమ్మల్నీ, మా కళని ఆదరించే వాళ్ళే లేరు. ఇంటికి ఎల్తే సాలు ఆకలని అరిసే పిల్లగాళ్ళు. పెళ్ళెప్పుడు జేస్తవు బాబా అని అడిగే ఆడపిల్లలు. కన్నదెందుకు పెంచడం రాని వాడికి? అని పెళ్ళాం సాధింపులు. ఏం జెయ్యాలి? ఏమీ జెయ్యలేను. అందుకే ఈ తాగుడు. పాతరోజులు గుర్తు చేసుకుని ఆ కాలంలోనే వున్నట్లు బతుకుతా! అందులోనే నాకు స్వర్గం కనిపిస్తది. కానీ, మాట తప్పడం నాకలవాట్లేదు. అందుకే ఆఘమేఘాల మీద పడి ఉరుక్కుంటూ, వచ్చినా!''

బాషా కన్నీళ్ళలో వాస్తవం వుంది. కదిలిపోయిన కమ్మని కాలపు స్మృతులున్నాయి. ఓ కళాకారుడి ఆర్తనాదం వుంది.

అతిథులు చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకున్నారు. రంజించిన హృదయాల మనసులు కరిగి బాషా ఒడిలో నోట్ల వర్షం కురిసింది. అతిథుల్లో వున్న ఓ టీ.వి.చానల్ అధినేత బాషాకు దగ్గరగా వచ్చాడు.

''సాబ్! మీకు అభ్యంతరం లేకపోతే నేను మీకు సాయం చేస్తాను. మా ఛానల్ ద్వారా మిమ్మల్ని మరిచిపోయిన ప్రజలకి మళ్ళీ పరిచయం చేస్తాను. ఏమో! పాతకన్నా కొత్తతరం మిమ్మల్ని మరింత ఆదరిస్తుందేమో! కాదనకండి''

బాషా కళ్ళనుండి ఆనందబాష్పాలు రాలాయి. మళ్ళీ సన్నాయి అతని పెదవుల్ని తాకింది.

''కొత్తపెళ్ళి కూతురా రారా! నీ కుడికాలు ముందు మోపి రారా!'' అప్పుడే అప్పగింతలు ముగిసి అత్తారింటికి బయల్దేరిన లాలిత్యని బాషా నాదస్వరం ఆహ్వానిస్తోంది.

☆

## కన్నడ తెరపై పార్వతి

**'వెన్నెల' సినిమా ద్వారా పరిచయమైన ఇండో జర్మన్ భామ పార్వతి మెల్టన్ ఇప్పటిదాకా తెలుగులోనే నటిస్తూ వస్తోంది. ఒకే భాషయితే లాభం లేదనుకుని ఇప్పుడు కన్నడ సినీ ఫీల్డువైపు దృష్టి మరలుస్తోంది. త్వరలోనే ఓ కన్నడ సినిమాలో నటించబోతున్న పార్వతి ఆ భాషలోకి వెళ్ళినా తెలుగు రంగాన్ని మాత్రం వదలనని, తను సినిమా తారగా మారి ఇంత గుర్తింపుకి కారణమైన తెలుగు పరిశ్రమని తనెలా మర్చిపోతానని అంటుంది.**

